డ్రగ్స్ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: డీసీపీ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్ తదితరులు

చంపాపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సమాజంలో డ్రగ్స్ నివారణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ గాయత్రీనగర్ చౌరస్తాలో స్థానిక ఉత్పత్తుల కేంద్రం (ఎల్‌పీడీఓ) చైర్మన్ భరత్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నూతన సంవత్సరం -2025 క్యాలెండర్‌ను డీసీపీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సింగమయ్యగుప్తా, శారద, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కామినేని ఆస్పత్రి వైద్యులు


మాట్లాడుతున్న కామినేని ఆస్పత్రి వైద్యులు

మన్సూరాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వాహన ప్రయాణాల్లో కనీసం ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా ప్రమాదాలకు గురై ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్న వారు రోజు రోజుకూ పెరిగిపోతున్నారని ఎల్బీనగర్ కామినేని ఆస్పత్రి ఎమర్జెన్సీ విభాగ ఇన్‌చార్జి, కన్సల్టెంట్ డాక్టర్ వెంకటరమణ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ వాహన ప్రయాణాల్లో ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ జాగ్రత్త వహించాలని సూచించారు. ఆస్పత్రి ఆవరణలోని ఆడిటోరియంలో క్రిటికల్ కేర్ కన్సల్టెంట్ డాక్టర్ పి.నవీన్‌రెడ్డి, డాక్టర్ శృంగల దేవిజన్‌తో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి నెలా 120 నుంచి 150 మంది చొప్పున ఈ ఏడాది 1500 నుంచి 1600 మందికి కామినేని ఆస్పత్రిలో చికిత్సలు నిర్వహించామనానరు. ఇందులో 70శాతం వరకు రోడ్డు ప్రమాదాలకు గురై వచ్చిన వారేనన్నారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని మద్యం తాగకుండా, హెల్మెట్లు ధరించి ప్రయాణాలు సాగించాలని కోరారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు సత్వరమే చేపట్టాల్సిన చర్యల గురించి కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో అంబులెన్స్ డ్రైవర్లకే కాకుండా విద్యార్థులకు, పోలీసులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

అభాగ్యులకు అండగా సీఎం సహాయనిధి


ఎల్ఓసీ పత్రాన్ని లబ్ధిదారు కుమారుడికి అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

మన్సూరాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబాలకు సీఎం సహాయనిధి ఒక వరమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలని టీపీసీసీ ప్రచారకమిటీ కోకన్వీనర్, ఐవీఎఫ్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం దుప్పలపల్లి గ్రామానికి చెందిన జి.మధు ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందాడు. వారి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండటంతో సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేయించారు. ఈ మేరకు మంజూరైన ఎల్ఓసీ పత్రాన్ని సోమవారం నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారు కుమారుడికి ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐవీఎఫ్ నల్లగొండ జిల్లా ప్రధానకార్యదర్శి పరమేశ్వర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

వనస్థలిపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మయ్యను సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా 010 పద్దు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ సమస్యలను వివరించి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ)లో సభ్యత్వం ఇచ్చినందుకు లక్ష్మయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జిల్లా గ్రంథాలయ సంస్థల పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కొక్కుల దేవేందర్, ప్రధానకార్యదర్శి సోమశివయ్య, కోశాధికారి దాచేపల్లి బుచ్చయ్య, పి.నాగేశ్వరరావు, గౌరవాధ్యక్షులు కనకంటి వీరప్ప, తుమ్మ సత్యనారాయణ ఉన్నారు.

నేడు, రేపు శ్రీరామచరిత్ మానస్ పారాయణం

సరూర్‌నగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్‌లోని పురాతన దేవతలగుట్టపై కొలువై ఉన్న శ్రీహనుమాన్ ఆలయంలో ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మంగళవారం ఉదయం 11.30 గంటల నుంచి బుధవారం ఉదయం 11.30గంటల వరకు.. నిర్వహించనున్నట్టు వారు పేర్కొన్నారు. అదేవిధంగా శ్రీరామ్ విజయ్ మంత్ర కీర్తన, శ్రీరామ యజ్ఞం కూడా నిర్వహించనున్నట్టు తెలిపారు. భక్తులకు మంగళ, బుధవారాల్లో మధ్యాహ్న భోజనం(అన్నదానం) అందిస్తామన్నారు.

ఐకేజేఏసీ అధికార ప్రతినిధిగా యిర్మియా



చాదర్‌ఘాట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నేషనల్ క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ(ఐకేజేఏసీ) అధికార ప్రతినిధిగా మలక్‌పేట నివాసి రెవరెండ్ కూనదొడ్డి యిర్మియా నియమితులయ్యారు. ఈ మేరకు కమిటీ చైర్మన్ రెవరెండ్ డాక్టర్ రోనాల్డ్ జాన్ ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జిల్లాలు, మండలాలు, డివిజన్ల స్థాయిలో నూతన కమిటీలను ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తానని తెలిపారు.

6న ద్విసహస్ర సువాసినీ పూజ

ఎల్బీనగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీశక్తి దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీశక్తిపీఠం ఆధ్వర్యంలో జనవరి 6న 2000 మంది మహిళా ముత్తైదువలతో ద్విసహస్ర సువాసినీ పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకురాలు మునిపల్లె సువర్ణలత తెలిపారు. ఈ కరపత్రాలను ఆర్కేపురంలోని కుర్తాళం పీటం ప్రత్యంగిరా దేవాలయంలో ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త అనంతలక్ష్మి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సువర్ణలత మాట్లాడుతూఎల్బీనగర్ సమీపంలోని మగ్దూంపల్లి భైరవపురిలో ద్విసహస్ర సువాసినీ పూజల నిర్వహిస్తున్నామన్నారు. పూజ ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. వివరాలకు సెల్‌నంబర్ 7997990023, 8858853690లో సంప్రదించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అరుణ, హేమ, రాజ్యలక్ష్మి, పద్మ, శ్రీదేవి, సంజన, ప్రశాంతి, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సంతోష్‌నగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): టీజీఎస్‌పీడీసీఎల్ సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు ఫీడర్లలో నిర్వహణ పనుల రీత్యా మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని డీఈ తెలిపారు. 11కేవీ న్యూనాగోల్, సమతపురికాలనీ, భవ్య హాస్పిటల్, మమతనగర్, వెంకటరమణకాలనీ, ఆదర్శనగర్, పెద్దఅంబర్‌పేట్, కోహెడ, పసుమాముల, తారామతిపేట్, కుంట్లూరు, గౌరెల్లి, లక్ష్మారెడ్డిపాలెం ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10.గంటల నుంచి మధ్యాహ్నం 1వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. 11కేవీ శివగంగ, హరిపురి ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10.30గంటల నుంచి 11.30 వరకు, 11కేవీ రాఘవేంద్రకాలనీ, కల్వంచ, శారదనగర్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10.30గంటల నుంచి 1.30 వరకు కరెంట్ ఉండదని తెలిపారు. 11 కేవీ లెక్చరర్స్‌కాలనీ, మదర్‌డైరీ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 వరకు, 11కేవీ గ్రీన్ హిల్స్, ఖిలామైసమ్మ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం12.30 నుంచి 1.30 వరకు, 11కేవీ హనుమాన్‌నగర్, దుర్గనగర్ ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ తెలిపారు.

సరస్వతీనగర్ కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గం

సైదాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్ సరస్వతీనగర్ కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఎస్. ప్రభాకర్ రెడ్డి, ప్రధానకార్యదర్శిగా సి.చెన్నారెడ్డి, సలహాదారులుగా రామారావు, శ్రీపతి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా జి.నర్సింహారెడ్డి, కె.సురేందర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా ఎం.మధుసూదన్‌రావు, డీవీ.రమణారెడ్డి, కల్చరల్, స్పోర్ట్స్ కార్యదర్శులుగా ఎస్.వినోద్ కుమార్, లీగల్ అడ్వయిజర్‌గా జీబీ.రుషికేష్‌రెడ్డి, కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని కాలనీవాసులు సన్మానించారు.

శివారులో కొలిక్కర్‌కో..?!

జోరుగా బెల్టుషాపుల వ్యాపారం

- వేకువజామునే లిక్కర్ దుకాణాల వద్ద క్యూ
- ఉదయం 5 గంటల నుంచే కిటకిట
- ఇళ్ల మధ్యలోనే నిర్వహణ
- లైసెన్స్ షాపుల్లో కన్నా 20 నుంచి 40% అధిక ధరలు
- పట్టించుకోని ఎక్సైజ్, లా అండ్ అర్డర్ పోలీసులు

శివారులో వేకువజామున కొక్కొరకో.. ఏమోకానీ లిక్కర్ కో.. వినిపిస్తోంది. ఉదయం 5 గంటల నుంచే బెల్ట్‌షాపుల వద్ద కొందరు క్యూ కడుతున్నారు. చాయ్ గ్లాస్‌కు బదులు పెగ్ గ్లాస్‌కు జైకొడుతున్నారు. లైసెన్స్ షాపుల్లో కన్నా నుంచి 40 % వరకు అధిక ధరలైనా కిక్కెక్కాల్సిందేనంటున్నారు. స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నా ఐ డోంట్ కేర్ అంటున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని గ్రామాల్లో బెల్ట్‌షాపుల వ్యాపారం జోరుగా సాగుతున్నా.. ఎక్సైజ్, లా అండ్ అర్డర్ పోలీసులు పట్టించు





అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగర శివారు పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ, అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని గ్రామాల్లో బెల్టుషాపుల జోరుసాగుతోంది. ఏ గ్రామంలో చూసినా బెల్టుషాపుల వ్యాపారం యదేచ్ఛగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు ఉన్న లిక్కర్ షాపులు ఉదయం 10 గంటల తర్వాత తెరుచుకుంటే...బెల్టు షాపులు మాత్రం తెల్లవారుజామున 5 గంటల నుంచే కిటకిటలాడుతున్నాయి. పలు గ్రామాల్లో తెల్లవారకముందే బెల్టుషాపుల ముందు మద్యం ప్రియులు క్యూ కడుతున్నారు. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్, లా అండ్ ఆర్డర్ పోలీసులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. బెల్టుషాపుల నిర్వాహకులతో ఆయా శాఖల అధికారులు ములాకత్ కావడంతోనే వాటిపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

మూడు బీర్లు.. ఆరు క్వాటర్లలా..

శివారులో బెల్టు షాపుల వ్యాపారం మూడు బీర్లు.. ఆరు క్వాటర్లలాగా సాగుతోంది. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 20కు పైగా బెల్టుషాపులు, లైసెన్స్ మద్యం శాపులో 6 వరకు ఉన్నాయి. దీంతో గ్రామాల్లో మద్యం విరివిగా లభిస్తోంది. దీంతో గ్రామాల్లో ఎక్కువ మంది మద్యానికి బానిసలవుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఆయా గ్రామాల్లోని బెల్టుషాపుల్లో ఉదయం 5 గంటల నుంచి 7 గంటల్లోగా ఎక్కువ శాతం మంది మద్యం తాగుతున్నట్లు సమాచారం. బెల్టుషాపుల మూలంగా పేదవారి బతుకులు చిన్నాభిన్నమవుతున్నాయి. ముఖ్యంగా కూలీపనులు చేసే వారు ఆ రోజు సంపాదనలో ఎక్కువ భాగం బెల్టు షాపులోనే ఖర్చుచేస్తున్నట్లు పలువురు తెలిపారు. గ్రామాల్లో కొనసాగుతున్న బెల్టుషాపులపై పలుమార్లు ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. లైసెన్స్ ఉన్న వైన్‌షాపుల్లో ధరల కంటే బెల్టుషాపులో 20 నుంచి 40 శాతం అధిక ధరలను వసూలు చేస్తున్నారు. బెల్టుషాపుల్లో అసలు మద్యం కంటే నకిలీమద్యం ఎక్కువగా అమ్ముతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

అసౌకర్యానికి గురవుతున్న ప్రజలు..

చాలా గ్రామాల్లో బెల్టుషాపులను నిర్వాహకులు ఇళ్ల మధ్యలో నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ మద్యం తాగేందుకు వస్తున్న మందుబాబులతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. బెల్టుషాపుల్లోనే మద్యం తాగడం, అక్కడే కొన్ని సందర్భాల్లో గొడవలు జరుగుతుండడంతో ఇబ్బందిగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాగిన మైకంలో కొందరు తమ ఇళ్లలోకి వస్తున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా తెల్లవారుజామున, రాత్రిపూట బెల్టుషాపు అడ్రసులు అడుగుతూ ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బెల్టుషాపులను ఎత్తివేస్తామన్న హామీని కాంగ్రెస్ నిలబెట్టుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. గ్రామాల్లోని ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని బెల్టుషాపులను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

చట్టపరమైన చర్యలు..

అక్రమంగా బెల్టుషాపు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. బెల్టుషాపులపై ఫిర్యాదు వస్తే వెంటనే పరిశీలిస్తున్నాం. దాడులు చేసి సీజ్ చేస్తున్నాం. కేసులు కూడా నమోదు చేస్తాం. అక్రమ మద్యంపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాం.

\- ధన్వంతరెడ్డి, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్, హయత్‌నగర్

విధి నిర్వహణలో జవాబుదారీతనం ఉండాలి

- రాచకొండ సీపీ సుధీర్‌బాబు
- ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లకు బాడీవోర్న్ కెమెరాలు అందజేత


మాట్లాడుతున్న సీపీ సుధీర్‌బాబు


ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ధరించిన బాడీవోర్న్ కెమెరాను పరిశీలిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలీసులు విధి నిర్వహణలో పారదర్శకంగా, జవాబుదారీతనంగా వ్యవహరించాలని రాచకొండ సీపీ సుధీర్ బాబు ట్రాఫిక్ సిబ్బందిని ఆదేశించారు. డ్యూటీలో ఉన్నప్పుడు ప్రజలతో వారు ప్రవర్తించే విధానం గౌరవప్రదంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అందుకు అనుగుణంగా వారు మాట్లాడే ప్రతి విషయం రికార్డు అయ్యే విధంగా సిబ్బందికి బాడీవోర్న్ కెమెరాలను అందజేశారు. నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్‌లో జరిగిన ట్రాఫిక్ మీటింగ్‌లో ట్రాఫిక్ అధికారులకు కెమెరాలు అందజేశారు. ప్రస్తుతం 50 కెమెరాలను అందజేసిన సీపీ.. ట్రాఫిక్ విధులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సిబ్బంది యూనిఫామ్‌కు ధరించే కెమెరాల వల్ల జవాబుదారీతనం, పారదర్శకతతో పాటు.. ప్రజలతో మాట్లాడే ప్రతి విషయం రికార్డు అవుతుందన్నారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించినా, పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించినా ఆధారాలతో సహా.. రికార్డుచేస్తుందన్నారు. అంతేకాకుండా ఎవరైనా అధికారులు ప్రజలతో దురుసుగా ప్రవర్తించినా, ఎన్‌ఫోర్స్‌మెంట్ చేస్తున్న క్రమంలో ఏదైనా ఇబ్బందులు పెట్టినా, అధికారులు అక్రమాలకు పాల్పడినా వెంటనే తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీలు శ్రీనివాసరావు, మల్లారెడ్డి, ఎస్ఓటీ డీసీపీలు మురళీధర్, రమణారెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, నైనా జైస్వాల్

నమ్మకంతోనే బ్యాంకుల అభివృద్ధి: స్పీకర్

సైదాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఖాతాదారుల నమ్మకాన్ని కల్పించడం ద్వారానే బ్యాంకులు మరింత అభివృద్ధి సాధిస్తాయని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మలక్‌పేటలో తిరుమల బ్యాంకు నూతన క్యాలెండర్, డైరీని టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనా జైస్వాల్‌తో కలిసి ఆవిష్కరించారు. వినియోగదారులకు మెరుగైన బ్యాంకింగ్ సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు చైర్మన్ నంగునూరి చంద్రశేఖర్, శ్రీనివాస్ స్వామిజీ, జీఎం శోభనాద్రిశర్మ, బ్యాంకు ఇన్‌చార్జి రవిశంకర్, బ్యాంకు డైరక్టర్లు, ఖాతాదారులు పాల్గొన్నారు.


మాసబ్ చెరువు ఎఫ్‌టీఎల్‌ను పరిశీలిస్తున్న హైడ్రా అధికారులు

మాసబ్ చెరువును పరిశీలించిన హైడ్రా

హయత్‌నగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగర శివారు తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువును సోమవారం హైడ్రా, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సందర్శించారు. చెరువు నలుమూలల తిరిగి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలను పరిశీలించారు. ఈ సందర్భంగా సమీపంలోని కాలనీవాసులు అధికారులతో మాట్లాడారు. రెగ్యులర్ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగానే చెరువును పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈఈ చెన్నకేశవరెడ్డి, ఏఈఈ వంశీ, మండల సర్వేయర్ జ్యోతి, హైడ్రా అధికారులు బాచిరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

ఇంటి ముందు స్కూటీ చోరీ

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు పార్కు చేసిన స్కూటీని గుర్తుతెలియని దుండగులు చోరీచేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కవాడిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగింది. కవాడిపల్లికి చెందిన రాసాల భాస్కర్‌యాదవ్ తన స్కూటీని రోజు మాదిరిగానే ఆదివారం రాత్రి ఇంటి ముందు పార్కు చేసి నిద్రపోయాడు. ఉదయం నిద్రలేచిన ఆయనకు ఇంటి ముందు స్కూటీ కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల వెతికినా దొరకలేదు. దీంతో ఈ విషయాన్ని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు సమాచారం అందించారు. క్రైం పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

హయత్‌నగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆటోలో అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాల రేషన్ బియ్యాన్ని హయత్‌నగర్ పోలీసులు పట్టుకున్నారు. సోమవారం 11 గంటలకు హయత్‌నగర్ పోలీసులు రేడియోస్టేషన్ సమీపంలో వాహన తనిఖీలు చేస్తున్నారు. జెట్ గూడ్స్ ఆటోలో 5 క్వింటాళ్ల రేషన్ బియాన్ని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. విచారణ జరపగా భువనగిరి పచార్లబోడు తండాకు చెందిన జటలోతు కుమార్(29) కొంతకాలంగా హయత్‌నగర్ వినాయకనగర్ కాలనీలో నివాసముంటూ రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి అధిక రేటుకు మరో వ్యక్తికి విక్రయిస్తున్నాడు. కిలో రూ.15 చొప్పున రేషన్ బియాన్ని కొనుగోలుచేసి, వనస్థలిపురంలో నివాసముండే నెహ్రూకు రూ.19 విక్రయిస్తున్నాడు. పోలీసులు కుమార్‌ను పట్టుకొని విచారించగా వనస్థలిపురం నుంచి విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. దీంతో హయత్‌నగర్ పోలీసులు ఆటోను, రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ట్రాఫిక్ పోలీసులతో మహిళ వాగ్వివాదం

సైదాబాద్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

సైదాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు స్పెషల్ డ్రైవ్‌ను సోమవారం కొనసాగించారు. సైదాబాద్ చౌరస్తా నుంచి సరూర్‌నగర్‌చెరువు కట్ట వరకు సంతోష్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు మలక్‌పేట సర్కిల్-6 టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి తొలగించారు. మొదట ఈనెల 21న ఆక్రమణలను కొంత మేర తొలగించారు. సోమవారం మరోసారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓ మహిళ పోలీసులను నిలదీసింది. పొట్టకూటి కోసం చిరు వ్యాపారాలు చేస్తున్న తమపై అధికారులు ప్రతాపం చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేసింది. సైదాబాద్‌లో యదేచ్ఛగా ఫుట్‌పాత్‌లు ఆక్రమించి భవనాలు నిర్మించిన వారిపై చర్యలు ఎందుకు తీసుకోకపోవడం లేదన్నది. 'పేదలపైనే మీ ప్రతాపమా' అంటూ పోలీసులతో వాగ్వివాదానికి దిగింది. చంద్రాయణగుట్ట ట్రాఫిక్ ఏసీపీ చంద్రకుమార్, సంతోస్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నర్సింహనాయక్, జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్ నర్సింగరావు పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుల ఎన్నిక

హయత్‌నగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఉమర్‌ఖాన్‌గూడ, సంఘీనగర్ బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షులను సోమవారం ఎన్నుకున్నారు. 208 బూత్ అధ్యక్షుడిగా నల్ల బాల్‌రెడ్డి, 209 అధ్యక్షుడిగా నల్ల మల్లారెడ్డి, 210 అధ్యక్షుడిగా తూళ్ల శివగౌడ్‌ను ఏకగ్రీవంగా ఉన్నకున్నారు. ఎన్నికల పర్యవేక్షకులుగా ఆ పార్టీ సీనియర్ నాయకులు యంజాల్ శ్రీనివాస్‌రెడ్డి, కందాళ బల్‌దేవ్ రెడ్డి వ్యవహరించారు. ఎన్నికల సమయంలో బూత్ కమిటీ అధ్యక్షులు కీలకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కడారి అనిల్‌కుమార్, బండారు దానయ్య, శంకరయ్య, శ్రీశైలం, శ్రీహరి, సుధాకర్, తరుణ్‌కుమార్, ప్రాణేష్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అమావాస్య అన్నదానం

చంపాపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): చంపాపేటలోని శ్రీనల్ల పోచమ్మ దేవాలయం ఎదురుగా మాత అన్నపూర్ణేశ్వరి అన్నప్రసాద వితరణ కమిటీ చైర్మన్ భగవత్‌జీ ఆధ్వర్యంలో అమావాస్య అన్నదాన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సోమవారం 500 మంది పేదలకు అన్నప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 నెలల నుంచి అమావాస్య రోజు పేదలకు అన్నదానం చేస్తున్నాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు రవిముదిరాజ్, కమిటీ సభ్యులు సుశీల్‌కుమార్ సంతోష్‌లడ్డా, ప్రవీణ్, గనసాల వెంకటేష్, టింగ్లీకర్ రాజేష్, రాజా, వెంకటేష్, షానవాజ్, హంస్సేనీ, మురళీధర్, రమేష్, హరిలాల్, మనోహర్, సాయి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ముసారాంబాగ్ రోడ్డుపై బారికేడ్లను ఏర్పాటు చేయాలి


సందీప్‌యాదవ్‌కు నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి

చాదర్‌ఘాట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ముసారాంబాగ్‌లోని స్వామి వివేకానంద సెంటినరీ హైస్కూల్ ముందున్న మెయిన్‌రోడ్డుపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు తక్షణమే పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇటీవల ముసారాంబాగ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన స్థానిక యువకుడు(సంజీవయ్యనగర్ బస్తీ) సందీప్‌యాదవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి స్థానికులతో కలిసి కొవ్వొత్తులతో కార్పొరేటర్ సోమవారం నివాళులర్పించారు. వాహనాదారుని నిర్లక్ష్యంతో సందీప్‌యాదవ్ ప్రాణం పోయిందని, అతని కుటుంబానికి తీవ్ర అన్యాయం జరిగిందని కార్పొరేటర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదానికి కారకుడైన వాహనాదారుపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో ఇదే రోడ్డుపై పోలీసు కానిస్టేబుల్ కూడా రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన షయాన్ని ఆమె గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆవుల ప్రవీణ్‌యాదవ్, శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్, బస్తీవాసులు బల్వంత్, రంజిత్, ఉమేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

'ఆల్ రిచ్ డెయిరీ'లో ఫుడ్ సేఫ్టీ తనిఖీలు

- అపరిశుభ్రతపై అధికారుల ఆగ్రహం
- నోటీసుల జారీ


స్వాధీనం చేసుకున్న పాలు, నెయ్యి ప్యాకెట్ల వద్ద ఫుడ్ సేఫ్టీ అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా పసుమాములలోని ఆల్ రిచ్ డెయిరీ ప్రైవేటు లిమిటెడ్‌లో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ టాస్క్ ఫోర్స్ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశాల మేరకు రాష్ట్ర టాస్క్ ఫోర్స్ టీం హెడ్, జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రోహిత్‌రెడ్డి, స్వాతి, జగన్నాథ్, శివ శంకర్‌రెడ్డి అధికారుల బృందం పాల ఉత్పత్తి తయారీ కేంద్రంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని అన్ని తయారీ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలకు విరుద్ధంగా డెయిరీని నడిపిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఫ్లేవర్డ్ మిల్క్ పదార్థాలను లైసెన్స్ కేటగిరిలో చేర్చకుండా తయారు చేసి విక్రయించడంతో పాటు అపరిశుభ్రత, తుప్పు పట్టిన మిషనరీని ఉపయోగిస్తూ పాల ఉత్పత్తులను చేస్తున్నట్లు గుర్తించారు. అదేవిధంగా హానికరమైన రసాయనాలను వాడుతున్నట్లు తెలిపారు. పాలు, పెరుగు డబ్బాలపై ఎలాంటి మూతలు పెట్టకుండా నిల్వ చేయడంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ సెక్షన్ల కింద డైరీ నిర్వాహకులకు నోటీసులను జారీచేశారు. లేబుల్ వివరాలు లేకుండా విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన రూ.1.68లక్షల విలువైనా 280 కిలోల నెయ్యి ప్యాకెట్లు, పాల నుంచి తీసిన 350 కిలోల క్రీమ్‌ను స్వాధీనం చేసుకుని సీజ్‌చేశారు. రూ.22 వేల విలువైనా 850 కిలోల కాస్టిక్ సోడాను అక్కడికక్కడే ధ్వంసం చేశారు. నెయ్యి, పాల శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపించినట్లు అధికారులు తెలిపారు. ఫుడ్ సేఫ్టీ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న వ్యాపారాలపై కఠినచర్యలు తీసుకుంటామని జ్యోతిర్మయి హెచ్చరించారు.

కోఠి ఈఎన్‌టీలో సమస్యలను పరిష్కరించాలి

మంగళ్‌హాట్, డిసెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): కోఠిలోని ప్రభుత్వ ఈఎన్‌టీ ఆస్పత్రిలో ఓపీ కౌంటర్లు మొదలు ప్రతీ చోట సమస్యలు తాండవం చేస్తున్నాయని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్(పీవైఎల్) రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ ప్రదీప్, ప్రగతిశీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షులు డి.స్వరూప మండిపడ్డారు. గత వారం నిర్వహించిన సర్వేలో అనేక సమస్యలు వెలుగు చూశాయని వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సోమవారం ఈఎన్‌టీ ఆస్పత్రి ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ గ్రేటర్ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీబాయి, వరలక్ష్మి, పీవైఎల్ గ్రేటర్ కార్యదర్శి బీఎస్ కృష్ణ, నాయకులు కిరణ్, భీమేష్, బంగారి శ్రీనివాస్, రాజు, వంకాయల సురేష్, సాయి, జాని, విశాలి పాల్గొన్నారు.